# తండ్రివాటా

"ఐదు, ఐదు రూపాయల నోట్లమ్మా. మొన్న ఈ సొరుగులో పెట్టాను."

"ఐదు ఐదులు ఇరవై ఐదు రూపాయలు! మొన్న నేనో రూపాయి కావాలంటే 'నా వద్ద ఒక్క రాగి డబ్బు కూడా లేదు, పొమ్మన్నావ్?' పాతిక రూపాయలు పెట్టుకునే అబద్ధమాడావన్నమాట."

విశ్వనాథంగారు టేబుల్ సొరుగు లాగి దానినుండి ఏదో తీసుకోబోయారు. అది అక్కడ కనబడక అందులోని కాగితాలన్నీ ఒత్తిగించి వెదకడం మొదలెట్టారు. ఆ అన్వేషణ ఫలించకపోవడంతో ఆయనకు చిరాకెత్తుకొచ్చింది. తలుపు వెనకాల పొంచి ఉండి అంతా కనిపెడుతూన్న తొమ్మిదేళ్ల కామాక్షి "ఏమిటి నాన్నా, వెతుకుతున్నావ్?" అని అడిగింది.



- పాలంకి వెంకటరామ చంద్రమూర్తి

"పోయిన నెల పక్కింటి చలపతిగారి నడిగి పాతిక రూపాయలు చేబదులుగా తెచ్చాను. ఆ అప్పు తీర్చడానికి నా జీతంలోంచి ఆ పాతికా కేటాయించి ఈ డ్రాయర్లో పెట్టాను... సరేకాని ఆ నోట్లేమైనట్టు?"

"ఏమవుతాయి? నువ్వు 'లేవ'ని అబద్ధమాడినందుకు లేకుండా పోయాయి!" అంటూ కామాక్షి అక్కడినుండి తుర్రుమంది. విసుగెక్కువైన విశ్వనాథం "ఒరేయ్, పెద్దబ్బాయ్! ఇందులో పెట్టిన నోట్లను మీరెవరైనా తీశారా?" అని కేకలు పెట్టాడు.

రాఘవరావు "ఫైవ్ రూపీ నోట్లేనా?" అంటూ వచ్చాడు.

ఆ జ్యేష్ఠుడు తండ్రి మాటకు జవాబివ్వకుండా, "ఇప్పుడేం సంజాయిషీ చెబుతుందో అమ్మ! 'పిచ్చి ఆలోచనకి పోయి డబ్బు తగలెయ్యకమ్మా!' అంటే విందికాదు" అంటూ తనలోనే గొణుక్కున్నాడు.

"ఏమిట్రా నా మీద నేరాలు చెబుతున్నావ్ షీ నాన్నతో?" అంటూ కాంతమ్మ గారక్కడకు వచ్చింది.

"ఆ పాతికా ఎలా తగలబెట్టావని నాన్న అడుగుతున్నారు!"

"తగలబెట్టడమేమిటిరా, వాజమ్మా! సొమ్మంటే మహాలక్ష్మి. అలాంటి అవాచ్యపు మాటలు అనకూడదు" అంటూ కాంతమ్మ కొడుకు బదులు తాను లెంపలు వేసుకుంది.

కూతురూ, కొడుకూ, పెండ్లామూ ఒకళ్ల తర్వాత ఒకళ్లు అందుకున్నారే కాని అసలు సంగతేమిటో చెప్పారేకాదు. ఒళ్లు మండి ఆయన "నరేనోయ్, ఏం చేశావో చెప్పు" అని పళ్లు పిండుకున్నాడు.

"ఏమిటండీ, నేనేదో పాడు చేసినట్లు నిలదీసి అడుగుతున్నారు? ఆ సొమ్ము సద్వినియోగమే అయింది."

"అంటే?"

"ఈవేళ శుక్రవారం మహాలక్ష్మికి పూజచేసి ధనప్రాప్తి కలగాలని కోరుకుంటూ -"

"ఆ సొమ్ముతో రవికల గుడ్డ కొని శాస్త్రులుగారి భార్యకు సమర్పించావన్నమాట!"

"కాదు నాన్నా" అంటూ కామాక్షి రంగప్రవేశం చేసింది మళ్లీ.

"కాకపోతే ఏమిటో చెప్పి చావండి." అన్నాడాయన కోపం కక్కుతూ.

పిల్ల మెల్లిగా "అమ్మ ఆ సొమ్ముతో లాటరీ టిక్కెట్లు కొంది" అంది.

విశ్వనాథం "కష్టపడి సంపాదించుకుంటున్న దానితో తృప్తిపడక లాటరీలో అప్పన్నంగా వచ్చిపడాలన్న దురాశా?" అంటూ చతికిలపడ్డాడు.

"దురాశేమిటండీ. డబ్బు చేదా? అదృష్టం బాగుండి లక్షో, రెండు లక్షలో వస్తే హాయిగా బతకొచ్చు."

"రెండు లక్షలా? చాలా?"

"ఎందుకండీ ఆ వెటకారం? పెసరట్ల బుచ్చిలింగానికి ఐదు లక్షలు రాలేదూ? ఆమాత్రం చెయ్యకపోయామా మనం?"

"నోరుముయ్యి!" అంటూ ఆయన అగ్నిపర్వతంలా బద్దలయ్యాడు. "ఇంతకీ "తప్పంతా నాది. నోట్లు పెట్టిలో పెట్టి తాళం వేయక 'ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు తగలెయ్యండ'ని డ్రాయర్లో వదిలేసి పోవడమేమిటి నేను!"

ఆవిడ ఊరుకుంటే తీరిపోను. "నేను 'జన్మానికల్లా శివరాత్రి' అని ఒకే ఒక్కసారి ధైర్యం చేసి మీ డబ్బు ముట్టుకున్నందుకు మీ యిష్టం వచ్చినట్లు మాటలంటున్నారు! అనండి" అని గద్గదిక తెచ్చుకుంది. కన్నీరు తుడుచుకుంది. దానితో అక్కడంతా నిశ్శబ్దమయింది.



★ "అదేమిటండీ లాయర్‌గారూ! నా బిల్లు నాలుగువందలని చెప్పి అయిదువందలు వేశారేంటి?" అర్థంకాక అడిగాడు క్లయింట్.
"అదేనయ్యా! రాత్రి హఠాత్తుగా మెలుకువ వచ్చింది. ఏం చేయాలో తోచక ఓ అరగంట సేపు నీ కేసు గురించి ఆలోచించాను. అందుకే అలా ...' చెప్పాడు లాయర్.
—ఎం.డి.సలీం, హైదరాబాద్

వాళ్లు ఎవరూ పెదవి విప్పకుండా అక్కడ ఎంతసేపు ఉండిపోదురో కాని కాంతమ్మ దంపతుల రెండవ కుమారుడు చిదానందం వార్తా పత్రికను చేతబుచ్చుకొని లోనికి ప్రవేశించాడు. "ఏమిటర్రా, అంత ఒకచోట జేరి ధ్యానం చేస్తున్నారు?"

తక్కిన వాళ్లు మౌనంగానే ఉండిపోయారు కాని కామాక్షే, "ఏం లేదు చిన్నన్నయ్యా, అమ్మేమో ఐదేసి రూపాయల లాటరీ టిక్కెట్లు కొంది. మీ యిద్దరి పేరా చెరొకటీ, నా పేర ఒకటి, తన పేర ఒకటీ కొంది. అయిదోది నాన్న పేర" అని వివరించింది.

"నేనేదో మహానేరం చేసినట్లు మీ నాన్న కోప్పడుతున్నారు!" అని కాంతమ్మ పూర్తి చేసింది.

చిదానందం, "ఐసీ" అని. ఒక్క క్షణం ఆగి, కేసు విచారణ ప్రారంభించాడు.

"ఐతే అమ్మా, ఆ ఇరవైయ్యైదు రూపాయిలూ లాటరీలో ఎందుకు వేశావు?"

ఆ ప్రశ్నకు విశ్వనాథంగారు జవాబు చెప్పాడు. "ఎందుకేమిటి? ఒక్క మాటుగా రెండు లక్షల రూపాయలు వచ్చి పడతాయని!"

చిదానందం తండ్రి మాటలోని వెటకారం గమనించినట్లు, "ఇరవై ఐదు రూపాయిలకు రెండు లక్షలు. అంటే, ఒక రూపాయి పెట్టుబడికి ఎనిమిది వేల రూపాయిలు రాబడి అన్న మాట. ఇంత ప్రీమియం వచ్చే ఇన్వెస్ట్‌మెంటు ఫస్ట్‌క్లాస్ ఇన్వెస్ట్‌మెంట్సులో లెక్క .... 'డబ్బు వస్తే మనమంతా సుఖపడవచ్చునన్న ఉద్దేశంతో అమ్మ ఈ ఇన్వెస్టిమెంట్ చేసింది. కనుక పర్పస్ బానాఫైడేయే ... ఇంక అమ్మ మీద కేసేముంది నాన్నా?"



★ పేషెంట్: సిస్టర్! డాక్టర్ గారు లేరా?
సిస్టర్: ఆపరేషన్ థియేటర్లో ఉన్నారు
పేషెంట్: ఆపరేషన్ చేస్తున్నారా?
సిస్టర్: కాదు. చిరిగిన చొక్కాకు కుట్లేసుకుంటున్నారు పిలవనా?
—కె.మమత, అవనిగడ్డ

చిదానందం తీర్పుతో వాతావరణం చల్లబడి విశ్వనాథం గారి పెదవిపై మందహాసం చిగురించింది. "కేసేం లేదు. 'ఆ రెండు లక్షలూ ఒక్కసారిగా వచ్చిపడితే దానిని ఖర్చు చెయ్యడం ఎలా?" అని ఆలోచిస్తున్నాను అంతే".

, అది ఆలోచించవలసిన విషయమే అన్నట్లుగా చిదానందం "ఔను, ఆ విషయం ఇప్పుడే సెటిల్ చేసుకోడం మంచిది. సొమ్మొచ్చి కూచున్నాక తీరిక ఎక్కడుంటుంది? ... అన్నయ్యా, నీకేమైనా డబ్బు అవసరం ఉందా?".

"ఎందుకు లేదూ? పథకం సిద్ధంగా ఉన్న వాణ్ణి నేనే. మొన్న మా ప్రొప్రయిటరుకూ నాకూ మాటా మాటా వచ్చి నానౌకరీకి రాజీనామా ఇచ్చేద్దామనిపించింది. 'మనకే డబ్బుంటే స్వంతంగా బిజినస్ ప్రారంభించి ఒకడికి ప్రాధేయపడనక్కర లేకుండా ఉండొచ్చు కదా?' అనుకున్నా. మనకు సొమ్ము వచ్చే విధానం ఉంది అంటే ఈ క్షణంలోనే వెళ్లి, మా ప్రొప్రయిటరుతో, 'నువ్వెంత, నువ్విచ్చిన ఈ చచ్చు ఉద్యోగమెంత?' అని మొహం మీద నాలుగూ దులిపేసి చక్కా వస్తాను!"

"వచ్చి, 'రావ్ బ్రదర్స్ - కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్' అని బ్రహ్మాండమంత సైన్ బోర్డు రాయించి ఆయన షాపు కెదురుగానే నీ షాపును కూడా ఓపెన్ చేసి - క్రమేపీ ఆయన బిజినెస్సంతా నీవేలాక్కోవచ్చు ... ఐతే ముందుగా నీ పెట్టుబడికెంత కావలసుంటుంది?"

"ముప్పై యైదు వేలో నలభై వేలో చాలనుకుంటాను" అన్నాడు రాఘవరావు. విశ్వనాథంగారు, "నలభై వేలు తీసుకో" అని చిదానందంతో, "నీ స్కీమేమిటి?" అన్నారు.

"ఈ ఆనర్స్ పూర్తి అవడంతోనే ఇంగ్లండ్‌కు పోయి బారిష్టరో అమెరికాకు వెళ్లి పి.హెచ్డీయో ఐ చక్కా వస్తాను".

"రైట్, నీ ఫారన్ ట్రిప్పుకి ఓ యాభై వేలు పడుతుందనుకుంటాను".

"ఆ మాత్రంచాలు. ఎలాగో మేనేజ్ చెయ్యొచ్చు" అన్నాడు చిదానందం.

"అమ్మడూ, నీకెంత కావాలో ఇప్పుడే చెప్పు; తర్వాత చెప్పడం వల్ల ప్రయోజనం ఉండదు".

కామాక్షి చాలాసేపు ఆలోచించింది. ఆఖరికి "నాకో బంగారపు గొలుసు కావాలి" అంది.

"ఓయ్ వెర్రి మొహమా ఇంతేనా?" అంటూ కాంతమ్మ అందుకొని, "అన్న లిద్దరూ తండ్రి సంపాదించి ఉంచిన ఆస్తికి మల్లే ఒకడు నలభై వేలూ మరొకడు యాభై వేలూ పంచుకుంటే నీకొక్క గొలుసేనా కావలసింది?" అని మందలించింది.

"అమ్మా, చెల్లాయికి అడగడం చేతకాకపోతే ఆమెకేం కావాలో నువ్వు ఆలోచించి చెప్పరాదూ?" అన్నాడు రాఘవరావు.

"ఎంతేనా కావాలి. బోలెడు ఖర్చుంది. దీనికి మంచి సంబంధం చూసి పెళ్లి చెయ్యాలంటే తగిన కట్నం ఇవ్వాలి. లాంఛనాలన్నీ జరపాలి. నగలూ నాణాలే కాకుండా జరుపవలసిన ముద్దూ ముచ్చటలెన్నో

ఉన్నాయి. అప్పుడతాత్తుగా సొమ్ము కోసం తడుముకోడం కన్న ఇప్పుడే అరవై వేలో, డెభైవేలో బ్యాంకులో వేసి ఉంచడం మంచిది.

"నిజమే నమ్మా, ఓ డబ్బయ్ వేలు డిపాజిట్‌గా వేద్దాము .. సరే కాని అమ్మా, నీ అవసరాలేమిటో చెప్పావు కాదు"

"నాకా నాయనా? తండ్రీ కొడుకులూ చేరి అయినదానికీ కాని దానికీ చివాట్లెట్టకుండా ఉంటే చాలు! నాకింకేమీ అక్కర్లేదు"

"అబ్బే, అలా అనెయ్యకు. ఈ డబ్బంతా నీ మూలాన్నే కదా వస్తోంది? మొహమాట పడక చెప్పు"

కాని కొండమ్మ చెప్పలేదు. లాటరీలో వేసి నందుకు వాళ్లు తనను అన్న మాటలన్నీ నెమరుకు తెచ్చుకుంటూ నిష్ఠూరంగా నిలబడిపోయింది.

కామాక్షి ఊరుకోనివ్వలేదు. "అమ్మా, నిన్న ఇంజనీరు గారి పెళ్లాం నిన్ను చేయించుకోమనలేదూ?" అని జ్ఞాపకం చేసింది.

"ఆవిడకేం తొంభై చేయించుకోమంటుంది. మనకు తాహతుండొద్దూ?"

"తాహతులేక పోడమేమిటి? రెండు లక్షలొచ్చి పడుతున్నాయిగా?" అంటూ విశ్వనాథం గారు రాజీకి ప్రయత్నించాడు.



★ డాక్టర్: ఎప్పటి నుంచి నీకు ఈ కళ్ళు మంటలు.
పేషెంట్: మొన్న మా ఆఫీసులో మూర్తిగాడికి ప్రమోషన్ వచ్చినప్పటి నుంచి? ... కసిగా చెప్పాడు.
— టి.వి.రమణ, కర్నూలు

కాని ఆవిడ మౌనంగానే ఉండిపోయింది. కామాక్షి "ఇంజనీరు గారి భార్య పెట్టుకొచ్చిన రవ్వల దుద్దులూ, రత్నాల గాజులూ, రాళ్లనెక్లేసూ అమ్మకి నచ్చాయి. నాన్నా వాటన్నింటికీ ముప్పై ఎనిమిది వేలు అయాయట"

"దరిమిలా ధరలు పెరిగి ఉంటాయి కనుక మనం అమ్మకోసం ఒక నలభై వేలు కేటాయిస్తే సరి" అన్నాడు రాఘవరావు.

"ఆ రెండు లక్షలలో ఇంక మిగిలిన దంతా నీదే ఫాదర్" అన్నాడు చిదానందం.

ఆరవ తరగతి చదువుతూన్న కామాక్షి తండ్రి వాటాగా ఎంత మిగిలిందో లెక్క చూసింది" నలభై ప్లస్ యాభై ప్లస్ డెబ్బై ప్లస్ నలభై. మొత్తం రెండు వందల వేలు. అంటే రెండు లక్షలు. రెండూ మైనస్ రెండూ ఈజ్ ఈక్వల్టూ జీరో.. అరె! నాన్నకేమీ మిగల్లేదర్రా!"

అ క్షణంలో వీధమ్మట వెడుతూన్న వక్కయింటి చలపతిని విశ్వనాధం గారు చూశాడు. ఆయన నవ్వుతూ తన వారితో నాకు మిగలకపోడమేమిటి? తీర్చవలసిన చేబదులు ఉందికదా? అదే నా వాటా!" అన్నాడు.

●

# శరీరంలో వణుకు ఎందుకు వస్తుంది

చాలా మంది తమ జీవితంలో ఏదో ఒక సమయంలో వణుకు అనుభవించి ఉంటారు. వణుకు అంటే సాధారణంగా చేతులు లేదా తలకి సంబంధించిన కండరాలు వేగంగా కదలడం. ఒక్కొక్కప్పుడు చేతులు ఎంతగా వణుకుతాయంటే ఆ సమయంలో ఆ వ్యక్తి ఏ వస్తువైనా సరిగా చేతితో పట్టుకోవడం అసాధ్యమవుతుంది. కంఠం కూడా వణకడం వల్ల ఆ వ్యక్తి మాట్లాడేమాటలు ఇతరులకు అర్థంకాకపోవడం కూడా కద్దు. చాలా మందికి వార్ధక్యంలో వణుకువస్తుంది. కాని ఇతర కారణాల వల్ల కూడా వణుకురావచ్చు. వీటిలో ముఖ్యంగా మానసికవత్తిడి, అలసట, టీ, కాఫీలు ఎక్కువగా సేవించడం, ఉపన్యాసం ఇవ్వాలంటే భయం, కొన్ని మందులు, ఆదుర్దా, మద్యపానం అలవాటున్నవారు అది మానేయడం మొదలైనవి చెప్పుకోవచ్చు. ఇటువంటి వణుకులు సాధారణంగా కొంచెంసేపు మాత్రమే ఉంటాయి.

కాని కొన్నిరకాల వణుకులు ఎక్కువకాలం ఉండవచ్చు. ,వీటిలో ప్రధానంగా రెండు రకాలుంటాయి. కొన్నిరకాల వ్యాధుల వల్ల వణుకు రావచ్చు. ఇదొకరకం. వ్యాధి వల్ల కాకుండా అనువంశికంగా వచ్చే వణుకు మరొక రకం. ఇందులో ముఖ్యంగా చేతులు, తల, కంఠం వణుకు ప్రదర్శిస్తాయి. వ్యక్తి విశ్రమిస్తున్నప్పటి కన్న కదులుతున్నప్పుడు ఈ రకం వణుకు ఎక్కువగా ఉంటుంది.

మెదడుకు, శరీరానికి మధ్య నమాచార ప్రసారంలో ఏ కారణం వల్లనైనా అంతరాయం కలిగితే వణుకు వస్తుంది. అనేక వ్యాధులు, గాయాలు, అనువంశికకారణాలు ఇందుకు దోహదం చేయవచ్చు. ఇది సంభవించినప్పుడు చేతులు, స్వరపేటిక మొదలైన అవయవాలలో కండరాలు సంకోచం చెందాలని ఆజ్ఞలు జారీ చేస్తూ సంకేతాలు పంపబడతాయి.

వణుకు ఆపాలంటే సంకేతాల సర్క్యూట్‌ను విచ్ఛిన్నం చెయ్యాలి. ఈ పని చేసే మందులు కొన్ని ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనవి లెవొడోపా అనేది. ఈ మందును




1960 లో ప్రధానంగా పార్కిన్‌సన్ వ్యాధి అనే మానసిక వ్యాధి చికిత్స కోసం ప్రవేశపెట్టారు. కాని అది వణుకులకు కూడా పనిచేస్తుందని కనుక్కున్నారు. ఈ మందు పెద్దమోతాదుల్లో తీసుకోవాలి. అయితే సుమారు. సగం మంది రోగుల్లో సుమారు 2-5 సంవత్సరాల్లో దాని ప్రభావం తగ్గిపోతుందని పరిశోధనలలో తేలింది. పైగా దాని వల్ల వికారం, గుండెదడ వంటి దుష్ప్రభావాలు కూడా కలుగుతాయి.

వణుకులకు శస్త్రచికిత్స సుమారు 120 నం. క్రితమే చెయ్యడం మొదలుపెట్టారు. ఇది మందులకు ప్రత్యామ్నాయ చికిత్స. అయితే మందులు విఫలమయిపోయి, వణుకులు నిరంతరం, భరించలేనంతగా ఉంటేనే శస్త్ర చికిత్స మార్గం అవలంబించాలని డాక్టర్లు ఎప్పుడూ సలహా ఇస్తారు. ఎందుకంటే ఈ శస్త్ర చికిత్స మెదడుకి నంబంధించినది. మెదడులో ఏ ప్రదేశంలో చికిత్స చేయాలనేవిషయం చాలా జాగ్రత్తగా త్రిమితీయ వ్యవస్థను ఉపయోగించి నిర్ణయించవలసి ఉంటుంది. లెవొడేపా అనే మందు కనుక్కొన్నప్పటి నుంచి వణుకులకు శస్త్ర చికిత్స చెయ్యడం డాక్టర్లు మానుకున్నారనే చెప్పవచ్చు. కాని 1980 తరవాత కంప్యూటరైజ్‌డ్ టోమోగ్రఫి, మాగ్నెటిక్ రెసొనెన్స్ వంటి అధునాతన పరిశీలనా విధానాలు అందుబాటులోకి వచ్చాక మెదడు లోతులలో ఏమున్నదీ గమనించడం సులువైంది. దాంతో మళ్ళీ శస్త్ర చికిత్సలో ఆసక్తి ఎక్కువైంది. సాధారణంగా ఈ శస్త్ర చికిత్సలు మెదడులో వ్రణాలు తొలగించడానికి చేస్తారు. అయితే దీన్నే కొద్దిగా మార్పుచేసి వణుకులు అపుచేయడానికి కూడా చేస్తున్నారు. ఈ చికిత్సను థలమోటోమి అంటారు. ఇందులో మెదడులో థెలమస్ అనే భాగంలో ఒక ప్రత్యేక ప్రదేశానికి ఎలక్ట్రోడ్ ఒకటి పంపి, దాన్ని వేడి చేస్తారు. దాని ప్రభావం వల్ల ఆ ప్రదేశంలో గాయం ఏర్పడి, వణుకులు ఆగిపోతాయి. ఈ ప్రక్రియలో వణుకులను కలిగించే ప్రసారవ్యవస్థకు అంతరాయం కలుగుతుంది.

ఈ చికిత్స చాలా మంది రోగులలో జయప్రదంగా జరిపి అనేక రకాల వణుకులను అదుపుచెయ్యడం సాధ్యమైంది. తీవ్రమైన ఆరోగ్య సమస్యలేవీ రాలేదు. శస్త్ర చికిత్స జరిపిన తరవాత 17 నెలల పాటు రోగులను పరిశీలించిన మీదట అమెరికాలోని మేయోక్లినిక్‌కి చెందిన డాక్టర్లు ఈ విషయాన్ని రూఢి చేశారు.

— ఆర్.